క్లుప్తంగా

అక్షర జ్ఞానం నేర్పేది గురువులే..

హెచ్ఎంను సత్కరించిన ఆర్డీఓ



హెచ్ఎం భీమేశ్వరరావును సత్కరిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

రాజానగరం: ఎవరు ఏ స్థాయిలో ఉన్నా.. అందుకు అవసరమైన అక్షర జ్ఞానాన్ని నేర్పేది మాత్రం గురువులేనని రాజమహేంద్రవరం ఆర్డీఓ, రాజానగరం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణాధికారి ఎ.చైత్రవర్షిణి అన్నారు. అందువల్లే గురువుకు సమాజంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం లభించిందన్నారు. స్థానిక బీసీ ఏరియాలోని మండల ప్రజాపరిషత్ ప్రభుత్వ పాఠశాల–2 హెచ్ఎం పీవీవీ భీమేశ్వరరావు ఉపాధ్యాయునిగా నాలుగు పదుల సర్వీసును పూర్తి చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆర్డీఓ.చైత్రవర్షిణి సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన శిక్షణ తరగతుల్లో ఉన్న ఆ ఉపాధ్యాయుడికి సహచరుల సమక్షంలో దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

సెకండ్ ఇయర్ పరీక్షకు 11 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. 404 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 388 మంది విద్యార్థులే వచ్చారని, 11 మంది గైర్హాజరయ్యారన్నారు. సోమవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఆంగ్ల పరీక్ష జరుగుతుందని ఆమె తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

8,766 ఎకరాల్లో పంట నమోదు పూర్తి

రాజానగరం: ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి పంట నమోదు (ఈ–క్రాప్) కార్యక్రమం మండలంలో 8,766 ఎకరాల్లో పూర్తయిందని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ తెలిపారు. ఈ రైతుల వివరాల జాబితాలను ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద ప్రదర్శించామన్నారు. సర్వే నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, పంట రకం, సాగు విస్తీర్ణం, ఆధార్ నంబరు పరిశీలించి, ఏమైనా అభ్యంతరాలుంటే సరిచేసుకునేందుకు ఐదో తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. ఈ గడువు దాటితే మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్ల సంయుక్త పరిశీలన జరిగితే కానీ మార్పులు చేయడానికి అవకాశం ఉండదనే విషయాన్ని రైతులు గమనించాలన్నారు. ఈ జాబితా ప్రకారమే పంట కొనుగోలు, బీమా తదితర విషయాలు ఆధారపడి ఉంటాయన్నారు.

జగన్ చేతుల్లోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ, జనసేన నేతలు



ఇనుగంటివారిపేటలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరిన నాయకులు

సీతానగరం: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల్లోనే ఉందని, ఇప్పటివరకూ జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం ఇనుగంటివారిపేటలో సర్పంచ్ సత్యం రాంపండు ప్రోద్బలంతో జనసేన, టీడీపీకి చెందిన సత్యం ప్రదీప్, పోలిమాటి సురేష్‌తో పాటు 50 మందికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వైఎస్సార్ సీపీ కండువా వేసి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రజా సంక్షేమ ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై అంతా వైఎస్సార్ సీపీలో చేరడానికి ఉవ్విళ్లూరుతున్నారని చెప్పారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కుల, మత వర్గాలకతీతంగా పార్టీ అభివృద్ధికి పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. గత ప్రభుత్వాల్లా కాకుండా, అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాల లబ్ధి చేర్చడమే వైఎస్సార్ సీపీ గొప్పతనమన్నారు. ఎటువంటి అవినీతికి, సిఫార్సులకు తావు లేకుండా, లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా నగదు జమ అవుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష నేతలకు ప్రజల్లో ఆదరణ లేదని, వారిని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్ష పార్టీలు వారిని వారే నమ్ముకుని పొత్తులతో వస్తుంటే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను నమ్ముకుని ఎన్నికల్లోకి వస్తున్నారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతూ, ప్రతిపక్ష పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తోందన్నారు.

ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ఇనుగంటివారిపేటలో సత్యం కొండయ్య కాపు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సర్పంచ్ సత్యం రాంపండు ఉచితంగా అందించిన ఐదు సెంట్ల స్థలంలో రూ.49.60 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రమాదానికి గురై, విశ్రాంతిలో తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల కోటేశ్వరరావును ఎమ్మెల్యే రాజా పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడు కుంచె అచ్యుతరామారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొండాటి ప్రసాద్, గాడి రవికుమార్ పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



బిక్కవోలులో పల్స్‌పోలియోపై పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

రంగంపేట: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో శనివారం పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలు 4685 మంది ఉన్నారని, వీరికి ఆదివారం 35 బూత్‌లలో పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ర్యాలీలో డాక్టర్ కె. చిన్నారావు, ఎంపీహెచ్ఈఓ పి.ప్రసాద్, పీహెచ్ఎన్ ఎల్.గంగాభవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పల్స్‌పోలియోపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి అన్నారు. శనివారం కొంకుదురు సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజాతో కలిసి ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమంలో వేసే రెండు చుక్కలు చిన్నారుల జీవితాలకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. బిక్కవోలులో పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ రాజు తెలిపారు. శనివారం సీతానగరం పీహెచ్‌సీ నుంచి పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోను పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు 5,689 మంది ఉన్నారని, వారందరికీ 36 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణాల్లో ఉన్న పిల్లల కోసం సీతానగరం బస్టాండ్‌లో కేంద్రం, ఇటుక బట్టీల వద్ద సంచార బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

రాజానగరం: దేశంలో పోలియో వ్యాధిని సమూలంగా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది రాజానగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సాయిబాబా గుడి సెంటర్, విద్యుత్ సబ్‌స్టేషను, పోలీసు స్టేషను, బస్టాండ్ మీదుగా గాంధీ బొమ్మ సెంటరుకు చేరింది. పీహెచ్‌సీ వైద్యులు మాట్లాడుతూ ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం కోసం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాలను నాలుగు రూట్లుగా విభజించి, 34 బూత్‌లను ఏర్పాటు చేశారు. రాజానగరం బస్టాండ్, జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి వద్ద ట్రాన్సిట్ పాయింట్లుగా రెండు బూత్‌లు ఉన్నాయి. రాజానగరం పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు 5,191 మంది చిన్నారులు ఉన్నారు. అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేశారు.



రంగంపేటలో పల్స్‌పోలియోపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



సీతానగరం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పేదలకు గృహ యోగం



రామవరంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పులుగుర్త, రామవరం గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు గృహ యోగం కల్పించారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వాటిని చేతల్లో చేసి చూపించడం ద్వారా ఆయన మాట తప్పని నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. నవరత్నాలు 'పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా శుక్రవారం రాత్రి మండలంలోని పులుగుర్త, శనివారం మండలంలోని రామవరం గ్రామాల పరిధిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రజా సంక్షేమం, అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు సాకారవంతమైన ఇళ్లు నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం శరవేగంతో అడుగులు వేస్తోందని చెప్పారు. దీనికి అనుగుణంగా స్థల సేకరణ చేసి అక్క చెల్లెమ్మలను గృహ యజమానులుగా చేయాలన్న ఆకాంక్షతో పూర్తి పారదర్శకంగా మహిళల పేరునే ఇంటి పట్టాల పంపిణీ చేపట్టిందన్నారు. ఇప్పటికే స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలికవసతులు, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. పేదోళ్ల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, దీన్ని ఓర్చుకోలేని ప్రతిపక్ష నాయకులు పలురకాలుగా అవాంతరాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఆశయాన్ని నెరవేర్చడంలో భాగంగా స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో వేలాది మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందించే అవకాశం తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో భాగంగా పులుగుర్తలో 265 మంది, రామవరంలో 402 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. తమకు ఇళ్ల స్థలాలు మంజూరుకావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, పులుగర్త, రామవరం సర్పంచ్‌లు కాకరపర్తి వేణు, గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పులుగుర్త ఉపసర్పంచ్ కర్రి భామిరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి

రూ.1.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజా



కళాశాల అదనపు గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సీతానగరం: దేశ భవిష్యత్తు నిర్ధారించేది నేటి యువతే అని, మంచి నాయకుడిని ఎన్నుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.1.40 కోట్ల రుస నిధులతో కళాశాల అదనపు గదులు, మౌలిక వసతుల కల్పనకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కేజీ నుంచి పీజీ వరకూ విద్యా ప్రమాణాలను పెంచి, ప్రపంచంలో ఎక్కడికెళ్లినా మన విద్యార్థులు నిలదొక్కుకునేలా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రంలో రూ.15 వేల కోట్లతో సుమారు 40 వేల పాఠశాలల రూపురేఖలను మార్చారన్నారు. ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రూ.38 కోట్లతో బొబ్బిల్లంక-ములకల్లంక బ్రిడ్జి నిర్మాణం ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే రూ.104 కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం తుదిదశకు చేరుకుందని, త్వరలో ప్రారంభించే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో రూ.8 కోట్లతో 36 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశామన్నారు. కళాశాల ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. కళాశాలలో అధ్యాపకుల కొరత సమస్యను పరిష్కరించామని గుర్తు చేశారు. జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ కోంద్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కవల కృష్ణమూర్తి, అంబటి రాజు పాల్గొన్నారు.

గొడౌన్ పైనుంచి జారి పడి వ్యక్తి మృతి

బిక్కవోలు: గొడౌన్ పైనుంచి జారి పడి యువకుడు మృతి చెందిన ఘటన తొస్సిపూడిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపిన వివరాల ప్రకారం రాయవరం గ్రామానికి చెందిన చంద్రమళ్ల విజయ్(34) తొస్సిపూడిలో ఉన్న ఓ గొడౌన్‌కు పెయింటింగ్ వేసేందుకు వచ్చాడు. శనివారం సాయంత్రం గొడౌన్ పైభాగంలో పెయింటింగ్ వేస్తున్న విజయ్ ప్రమాదవశాత్తూ పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన విజయ్‌ను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. మృతుడు విజయ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో విజయ్ బంధువులు మృతదేహాన్ని తొస్సిపూడి గొడౌన్ వద్దకు తీసుకొచ్చి అతడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ బుజ్జిబాబు ఇరువర్గాలతో మాట్లాడి రాజీ కుదిర్చారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: మండలంలోని సంపరలో ప్రాచీన వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మాఘ మాసం సందర్భంగా శనివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు స్వామివారికి తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

దివాన్ చెరువులో ఎన్ఎస్ఎస్ సేవలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక సేవా శిబిరాన్ని రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ శనివారం ప్రారంభించారు. ఈ నెల ఏడు వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామ సచివాలయం-2 పరిధిలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, యూనివర్సిటీ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీఓలు, వలంటీర్లు పాల్గొన్నారు.